గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంత ప్రాధాన్యమిచ్చిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వ వ్యసన విముక్తి విభాగం(డి–అడిక్షన్ బ్లాక్), పిల్లలు, వృద్ధుల మానసిక విభాగం, పునరావాసం కేంద్రాలను పెద్దవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని భావించి ఇందుకోసం రూ.28.60 కోట్లు ఖర్చు పెట్టింది. మూడు విభాగాల నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి మాత్రం అవి **నోచుకోవడం లేదు. దీంతో నూతన విభాగాలు మోక్షం కోసం ఎదురు చూస్తున్నాయి.** – బీచ్‌రోడ్డు

మోక్షమెప్పుడో..?

పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాల



• ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ప్రారంభానికి నోచుకోని మూడు నూతన విభాగాలు • వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.28.60 కోట్లతో నిర్మాణం • ఆసక్తి చూపని కూటమి ప్రభుత్వం

వ్యసన విముక్తి విభాగం



మద్యం, గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాలకు బానిసై జీవితాలను పాడుచేసుకుంటున్న వారికి ప్రత్యేక వైద్యం అందించేందుకు డి–అడిక్షన్ సెంటర్లు ఎంతో దోహదపడతాయి. పేదలకు ఈ వైద్యం ఎంతో ఖర్చుతో కూడికున్నది. ఈ విషయాన్ని గ్రహించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు వార్డులతో ఒక ప్రత్యేక డి–అడిక్షన్ బ్లాక్‌ను మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసింది. వ్యసన విముక్తి విభాగంలో 40 బెడ్లు అందుబాటులో ఉంటాయి. ఈ సెంటర్ ప్రారంభమైతే వ్యసనాలకు బానిసై మానసిక సమస్యలతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించవచ్చు.

పిల్లలు, వృద్ధుల మానసిక చికిత్స విభాగం



పిల్లలు, వృద్ధుల్లో వచ్చే మానసిక సమస్యలకు వైద్యం అందించేందుకు ప్రత్యేక నిపుణులతో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ బ్లాక్ ద్వారా అందరి మానసిక రోగులతో కాకుండా ప్రత్యేకంగా చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఇటువంటి విభాగం కలిగిన మొదటి ప్రభుత్వ ఆస్పత్రి కూడా ఇదే కావడం విశేషం. ఈ విభాగంలో పిల్లల కోసం 20 బెడ్లతో ఒక వార్డు, వృద్ధుల కోసం 20 బెడ్లతో ఒక వార్డు అందుబాటులో ఉన్నాయి.

మార్చి నాటికే నిర్మాణాల పూర్తి..

ఈ మూడు విభాగాల నిర్మాణం ఈ ఏడాది మార్చి నాటికే పూర్తయ్యాయి. ఆ నెలలో ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఈ బ్లాక్‌ల ప్రారంభం వాయిదా పడింది. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఈ కేంద్రాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపించడం లేదు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి అనేక సార్లు నగరానికి వచ్చినా.. ఈ విభాగాలను మాత్రం ప్రారంభించ లేదు. ఒకసారి ప్రారంభిస్తామని చెప్పి.. చివరి క్షణంలో వాయిదా వేశారు.

సిద్ధంగా విభాగాలు.. ప్రారంభించాలని విజ్ఞప్తి

మానసిక వైద్యశాలలో బెడ్లు, ఇతర మౌలిక వసతులతో మూడు విభాగాలు సిద్ధంగా ఉన్నాయి. వీటిని ప్రారంభిస్తే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల ఈ విభాగాలు ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. వీలైనంత వేగంగా నూతన విభాగాలను ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని రోగుల బంధువులు, స్థానికులు కోరుతున్నారు.

పునరావాస విభాగం

మానసిక ఒత్తిడి కారణంగా బాధపడుతున్న రోగులకు పునరావాసం కల్పించడానికి ఆస్పత్రిలో రిహాబిలిటేషన్ బ్లాక్ నిర్మించారు. ఇందులో బాధితులెవరైనా ఉండొచ్చు. తాత్కాలిక ఉపశమనం పొందడానికి పునరావాసపు విభాగం ఎంతో ఉపయోగపడుతుంది.



కాలభైరవుడికి పూజలు



పూజలందుకున్న కాలభైరవ స్వామి

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజిపాలెంలోని జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన కాలభైరవ స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రకాష్, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా అఖండ దీప సాగర హారతి



సైకత లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

ఏయూక్యాంపస్: కార్తీక మాసంలో చివరి రోజైన ఆదివారం బీచ్ రోడ్డులో అఖండ దీప సాగర హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కాళీమాత ఆలయం ఎదురుగా బీచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై పండితులు ప్రత్యేకంగా రుద్రాభిషేకం జరిపించారు. భక్తులు స్వయంగా సైకత లింగానికి తమ స్వహస్తాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక పరిమళాన్ని నింపాయి. గౌరీ పరమేశ్వరుల కల్యాణం, సాగర హారతి, సైకత లింగ నిమజ్జనంతో కార్యక్రమం ముగిసింది.

క్లుప్తంగా

నెమళ్ల జోన్‌లో పాత్‌వేలు



జూ పార్కులోని నెమళ్ల జోన్‌లో నిర్మిస్తున్న పాత్‌వే

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో కొద్ది రోజులుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నెమళ్ల జోన్‌లో సందర్శకుల సౌకర్యం కోసం పాత్‌వేలు నిర్మిస్తున్నారు. ఇక్కడ నీలం, తెలుపు రంగుల నెమళ్ల సందర్శకులను అలరిస్తున్నాయి. వీటితోపాటు ఈ జోన్‌లో అడవి కోళ్లు కూడా ఉన్నాయి. జూ పార్కుకు వెళ్లిన సందర్శకులు నెమళ్లు పురివిప్పి చేసే నాట్యం, వాటి అందాలు చూస్తూ ఎక్కువ సేపు గడుపుతున్నారు. ఇక్కడ గతంలో నిర్మించిన పాత్‌వే శిథిలం కావడంతో జూ అధికారులు దాన్ని తొలగించారు. దాని స్థానంలో మరికొంత విస్తరించి కొత్త పాత్‌వేలు నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే సందర్శకులు ఇక్కడ నెమళ్లను చూస్తూ గడపడానికి సౌకర్యవంతంగా ఉంటుంది.

ఘనంగా జేఎన్‌టీయూ అలుమ్ని సమావేశం



వీసీ మురళీకృష్ణను సత్కరిస్తున్న అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: జేఎన్‌టీయూ కాకినాడ అలుమ్ని విద్యార్థుల సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని ఐఏఎం వేదికగా జరిగినన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ కాకినాడ వీసీ డాక్టర్ కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ ప్రసగించారు. 43 ఏళ్లగా నిర్విరామంగా ఈ సమావేశం నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులను అభినందించారు. యూనివర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులు వీసీ మురళీకృష్ణను సత్కరించారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల తోపాటు ఎన్‌ఆర్‌ఐలుగా ఉన్న అలుమ్ని విద్యార్థులంతా ఈ సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. పలువురు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ఎయిడ్స్ దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వకృత్వం ,చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, రెడ్ రిబ్బన్ క్లబ్, రెడ్‌క్రాస్, ఉన్నత అభియాన్ ప్రతినిధులు సాయికృష్ణ, రామకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

15న వన భోజనాలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న వన సమారాధన నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్షుడు ఆడారి పరదేశినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంబాలకొండలో పిక్నిక్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పాత వెంకోజీపాలెంలోని చిన్న, పెద్దలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిత్రం చెప్పిన సందేశం



చిత్రాలు గీస్తున్న చిన్నారులు



చిన్నారులు గీసిన చిత్రాలు



బీచ్ రోడ్డు మీద పర్యావరణ మార్పులపై చిత్రాలు గీస్తున్న యువత

ఏయూక్యాంపస్: మానవ తప్పిదాలతోనే పర్యావరణ మార్పులు సంభవిస్తున్నాయని పలువురు చిన్నారులు, యువత తమ చిత్రాలతో కళ్లకు కట్టినట్లు చూపారు. ప్రోగ్రెసివ్ ఆర్టిస్ట్స్ లీగ్(పీఏఎల్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో ఆర్ట్ ఫర్ చేంజ్–విజువలైజింగ్ క్లైమేట్ చేంజ్ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నేటి సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన పర్యావరణ మార్పునకు కారణాలను తమదైన శైలిలో చిత్రాలుగా మలిచారు. మనుషుల ప్రాణాలను సైతం లెక్కచేయకుండా లాభాల కోసం పని చేసే పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ సమస్యలకు కారణమని చిత్రకారులు తమ చిత్రాలతో చూపారు. సమాజంలో అనేక సమస్యలను కళను మాధ్యమంగా చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. సంస్థ సభ్యులు అజయ్, సుజన్, నీనా, భగత్, జన్య, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

బార్లలో 24 గంటలూ మద్యం విక్రయాలు



ఆరిలోవ కాలనీలో బార్ వద్ద ఉదయం 6.30 గంటలకు మద్యం విక్రయిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో 24 గంటలూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి బార్లలో వేళాపాళా లేకుండా పుష్కలంగా మద్యం అమ్ముతున్నారు. దీంతో మందుబాబులు నాన్‌స్టాప్‌గా మద్యం తాగి వీరంగం సృష్టిస్తున్నారు. సాధారణంగా బార్‌లకు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది. ఈ నిబంధనలను కూడా బార్‌ల యజమానులు పక్కన పెట్టి దర్జాగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం వాటి జోలికి వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తెల్లవారు మొదలు మందుబాబుల రచ్చ..

ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్, అంబేడ్కర్ కూడలి సమీపం, డెయిరీ ఫారం వద్ద రెండు చోట్ల బార్‌లే ఉన్నాయి. అవన్నీ సమయపాలన లేకుండా మద్యం విక్రయాలు జరిపేస్తున్నాయి. అక్కడ తెల్లవారు నుంచి అర్ధరాత్రి వరకు మందుబాబులు పూటుగా మద్యం తాగి రచ్చ చేస్తున్నారు. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్ వద్ద సరిగమ రెస్టారెంట్ అండ్ బార్ మందుబాబులకు సౌకర్యాలు కూడా కల్పిస్తోంది. మందుబాబులు మద్యంలో కలుపుకోడానికి తెల్లవారే సరికే తాగునీటి కేన్‌లు సిద్ధం చేస్తున్నారు. మూసి ఉన్న గేటు లోపల నుంచి బార్ సిబ్బంది మద్యం అందిస్తారు. ఆ మద్యంలో నీటిని కలిపి పూటుగా తాగుతున్నారు. ఖాళీ మద్యం బాటిళ్లు, డిస్పోజిబుల్ గ్లాసులు వేయడానికి పక్కనే డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. తాగిన అనంతరం మందుబాబులు కొందరు వాటిని డస్ట్‌బిన్లలో వేస్తే, ఇంకొందరు రోడ్డుమీదే విసిరేస్తున్నారు. అంబేడ్కర్ కూడలి, డెయిరీ ఫారం వద్ద బార్లలో కూడా ఇదే పరిస్థితి. విశాలాక్షినగర్‌లో కూతవేటు దూరంలోనే ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయం ఉన్నప్పటికీ అధికారులు ఎవ్వరూ వీటి వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. వారి కనుసన్నల్లోనే బార్ అండ్ రెస్టారెంట్లలో 24 గంటలూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే పలువురు విమర్శిస్తున్నారు.

పర్యాటక ప్రాంతాలకు తుఫాన్ దెబ్బ



ఇందిరాగాంధీ జూ పార్కు

ఆరిలోవ: రెండు రోజులుగా కొనసాగుతున్న తుఫాన్ ప్రభావం పర్యాటక ప్రాంతాలపై పడింది. కార్తీక మాసం చివరి ఆదివారం కూడా తుపాను దెబ్బతో పర్యాటక ప్రాంతాలు సందర్శకులు లేక వెలవెలబోయాయి. రోజంతా మబ్బులు, చినుకులు కురవడంతో నగరవాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. సాధారణంగా కార్తీక మాసం సెలవు రోజుల్లో నగరంలోని అన్ని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడుతుంటాయి. అందులో ఆదివారం మరింత సందడిగా కనిపిస్తాయి. తుఫాన్ కారణంగా సాధారణ రోజుల్లో వెళ్లే సందర్శకుల సంఖ్య కంటే ఆదివారం తగ్గిపోవడం విశేషం. నగరంలోని ఇందిరాగాంధీ జూ పార్కు, కైలాసగిరి, కంబాలకొండ తదితర పర్యాటక ప్రాంతాలను తుఫాన్ ఎఫెక్ట్ తాకింది. జూ పార్కును 2,597 మంది సందర్శించారు. వారి నుంచి రూ.2.18 లక్షలు మాత్రమే ఆదాయం లభించింది. ఈ సంఖ్య సాధారణ రోజుల కంటే తక్కువే. గత ఆదివారం జూ పార్కును 13,650 మంది సందర్శించగా.. రూ.9.67 లక్షలు ఆదాయం చేకూరిన విషయం తెలిసిందే. ఈ వారం దానిలో నాలుగో వంతుకు పడిపోయింది. వనభోజనాలతో కళకళలాడాల్సిన కంబాలకొండ ఆదాయానికి తుఫాన్ ప్రభావంతో గండిపడింది. దీనిని 150 మంది కంటే తక్కువగానే సందర్శించారు. వారి ద్వారా సుమారు రూ.5,000 ఆదాయం లభించింది. గత వారం 1,500 మంది సందర్శకుల ద్వారా రూ.1.10 లక్షల ఆదాయం లభించిన విషయం తెలిసిందే. కైలాసగిరిని సందర్శించిన వారి సంఖ్య 1,000 దాటకపోవడం విశేషం.

నూతన కార్యవర్గం ఎంపిక

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) భీమిలి డివిజన్ ఎన్నికలు ఆదివారం కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఎం.జిలానీ ఎన్నికల అధికారిగా, నగర అధ్యక్షుడు బీవీఏఎస్ నియోగి అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. 2024 నుంచి 2027 వరకు ఉండే కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్.చేతన్ కుమార్ (డీటీ, ఆనందపురం మండలం), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సుధాకర్ (డీటీ, ఆర్‌డీవో ఆఫీస్, భీమిలి), ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేష్ (సీనియర్ అసిస్టెంట్, ఆర్‌డీవో, భీమిలి), ఎల్.లోకేష్(టైపిస్ట్, ఆనందపురం తహసీల్దార్ ఆఫీస్), డి.శ్యామల(ఆర్ఐ, పద్మనాభం తహసీల్దార్ ఆఫీసు), కార్యదర్శిగా సీహెచ్ రవి కృష్ణ (డీటీ, పద్మనాభం తహసీల్దార్ ఆఫీస్), సంయుక్త కార్యదర్శులుగా టి.మల్లేశ్వరరావు (ఆర్ఐ, భీమిలి తహసీల్దార్ ఆఫీస్), ఏవీ కిషోర్ (ఆర్ఐ, విశాఖ రూరల్ తహసీల్దార్), ఎండీ ముస్తఫా(ఆనందపురం తహసీల్దార్ ఆఫీస్), కోశాధికారిగా ఎస్.కె.ఇబ్రహీం (సీనియర్ అసిస్టెంట్, సీతమ్మధార), ఈసీ సభ్యులుగా టి.రామచంద్, పి.జ్ఞానదీప్ ఎన్నికయ్యారు.

ధ్యానంతో ప్రశాంతత

విశాఖ విద్య: నిష్కామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏయూ క్యాంపస్‌లోని డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో 'ధ్యానం: నిర్విషయం మనః' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అరుణాజీ ప్రసంగిస్తూ ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ధ్యానం ప్రాముఖ్యత, మనసును నియంత్రించడం ధ్యాన సాధనలో ఎంత ముఖ్యమో వివరించారు. ధ్యాన సాధనలో ఎదురయ్యే అవరోధాలు, ధ్యానం చేయడానికి అనుసరించవలసిన విధానాలను తెలియజేశారు. ముఖ్య అతిథి డాక్టర్ పి.వి.సుధాకర్(అనిల్ నీరుకొండ ఎడ్యుకేషన్ సొసైటీ డీన్) నిష్కామ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. భగవద్గీత అధ్యయనం ప్రాముఖ్యతను విశదీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ కుమార రాజా (కుమార రాజా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్) తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ విద్యార్థులు వెళ్లిపోవాలంటూ ధర్నా



ఇంటర్నేషనల్ హాస్టల్ ముందు ధర్నా చేస్తున్న జన జాగరణ సమితి సభ్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో చదువుతున్న బంగ్లాదేశ్ విద్యార్థులు వెంటనే తమ దేశానికి తిరిగి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ ఏయూలోని ఇంటర్నేషనల్ హాస్టల్ వద్ద జన జాగరణ సమితి, హిందూ ధార్మిక సంస్థలు ఆదివారం ధర్నా చేశాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హింసకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టినట్లు జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు, ధార్మిక సెల్ కో–కన్వీనర్ విజయ్ శంకర్ ఫణీంద్ర తెలిపారు. బంగ్లాదేశ్ విద్యార్థులు వెంటనే వారి దేశానికి వెళ్లిపోవాలని, లేదంటే తామే తరిమేస్తామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హాస్టల్ ముందు బ్యానర్లు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు 26 వరకు గడువు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో 2025 ఫిబ్రవరి 8,9 తేదీల్లో జరుగనున్న హిందీ లోయర్, హయ్యర్ పరీక్షల గడువు పెంచినట్టు ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15 వరకు, రూ.10 అపరాధ రుసుంతో 26 వరకు ఫీజులు చెల్లించవచ్చన్నారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశిక, రాష్ట్రభాష విశారద పూర్వార్ధ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలు రాయాలనుకునేవారు ఫీజు చెల్లింపు, ఉచిత శిక్షణకు 89858 97419, 89856 47419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రీడా నైపుణ్యం వెలికితీసేలా పోటీలు



ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ విజయ్‌మోహన్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఆదివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ క్రీడా మైదానంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. ఈ పోటీలకు ఏయూ ఎఫిలియేషన్ కళాశాలల నుంచి వంద మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి మేరకు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారులు ఏయూ జట్టు తరపున పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పీడీ డాక్టర్ లక్ష్మణ్‌రెడ్డి, ఐఐపీఈ క్రీడాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు పి.శ్రీనివాసరావు, పరిశోధకుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మూడు సచివాలయాల దారి..

ఇరుగ్గా మారి



ఆరిలోవ పోలీస్ స్టేషన్ వెనుక గల మూడు సచివాలయాలకు వెళ్లే దారి

ఆరిలోవ: ఆరిలోవలో మూడు వార్డు సచివాలయాలకు వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ వెనుక 1, 2, 21 నంబర్లు గల సచివాయాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో 1,000 నివాసాలున్నాయి. ఈ లెక్కన ఇక్కడ ఉన్న 3,000 నివాసులు వివిధ అవసరాల నిమిత్తం సచివాలయాలకు వెళ్తుంటారు. వారిలో ప్రతి సచివాలయానికి రోజులో ఏదో ఒక పనిమీద వందల మందే వెళ్తారు. అంత వరకు బాగానే ఉన్నా.. ఈ సచివాలయాకు వెళ్లి వస్తున్న దారే ఇరుగ్గా మారింది. ఆరిలోవ పోలీసులు వారి పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గురైన వాహనాలు, దొంగలు నుంచి పట్టుబడిన వాహనాలను తీసుకొచ్చి ఈ సచివాలయాలకు వెళ్లే దారిలో నిలిపి ఉంచుతున్నారు. ఏళ్ల తరబడి ఈ వాహనాలను ఇక్కడే వదిలేస్తున్నారు. ఇవి రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇటీవల లభించిన వాహనాలను ఇక్కడ ఖాళీ స్థలంలో వీలు కాకపోవడంతో సచివాలయాలకు వెళ్లే దారిలోనే నిలిపేశారు. దీంతో సచివాలయాలకు వెళ్లే దారి మరింత ఇరుగ్గా మారింది. దీనివల్ల సచివాలయానికి వెళ్లేందుకు దారి లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఈ వాహనాలను పక్కకు జరిపించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

రుషికొండ భవనాలు వినియోగంలోకి తీసుకురావాలి

సీతమ్మధార : రుషికొండ భవనాల వినియోగంపై ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కన్వీనర్ సరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి రుషికొండ భవనాలు తిలకించారని, వీటి వినయోగంపై ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరిన నేపథ్యంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఆచార్య ఎం. ముత్యాలనాయుడు, మాజీ శాసన మండలి సభ్యులు ఎం.వి.ఎస్.శర్మ, మంత్రి శ్యాం ప్రసాద్, కల్నల్ సుబ్బారావు, కెప్టెన్ కె.ఎస్. నాయుడు, జయశ్రీ , సోహాన్ హట్టంగాడి , సీనియర్ జర్నలిస్ట్ ఎస్.శివశంకర్, కొత్తపల్లి వెంకట రమణ, డాక్టర్ సీతల్, మేడా మస్తాన్ రెడ్డి, వివిధ బౌద్ధ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. తక్షణం భవనాలను ప్రజలు తిలకించేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. నిర్మించిన భవనాలు వినియోగంలోకి తీసుకురాకపోవడం సరికాదన్నారు. ప్రజాధనంతో కట్టిన భవనాలను ప్రజలకే ఉపయోగపడాలని తెలిపారు. నగరంలోని ఉన్న మ్యూజియంలన్నీ ఇక్కడే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.